

# బాబోయ్...ఇవేం రోడ్లు..!



-ప్రధాన రహదారులపైనా భారీ గుంతలు
- పూర్తిగా పాడైపోయిన గోల్నాక- ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి
-అంతర్గత రోడ్లు మరీ అధ్వాన్నం
-రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త**


భారీ వర్షాలకు మహానగర రహదారులు ఎప్పటిలాగే ఛిద్రమయ్యాయి. వందల కోట్లు ఖర్చు పెట్టినా పరిస్థితిలో మార్పు కాలేదు. నగరంలో రోడ్లన్నీ గుంతలు, కంకరతో నిండి స్థానికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధ్వానమైన రోడ్లపై ప్రయాణిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీనికి తోడు పైపులైన్లు, కేబుళ్ల కోసం తవ్విన రోడ్లను సకాలంలో పునరుద్ధరించకపోవడంతో చాలాచోట్ల దారులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ గుంతలు పడినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరుజల్లులు కురిస్తే నగరం చెరువును తలపిస్తుంది.. అలాంటిది భారీ వర్షం పడిందంటే ఇక సముద్రాన్ని తలపించేలా ఉంటోంది. గ్రేటర్‌లో 9,103 కి.మీల రహదారులున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా రోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిన్నపాటి వర్షం పడితే ఆ గోతుల్లో నీరు చేరి చెరువు నిండుతుంది. దీన్ని గుర్తించని డ్రైవర్లు చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించడం సాహసమేనని అంటున్నారు. కాగా, నగరంలో రోడ్లు మరింత నరకంగా మారుతున్నాయి. రోడ్లపై గుంతలు తవ్వడంతో వాహనదారులు, పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు. లెక్కలేనన్ని గోతులపై గతిలేక ప్రయాణం సాగిస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి. గోతులు పూడ్చేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ, శివారు మున్సిపాలిటీ సిబ్బంది.. దెబ్బతిన్న రోడ్లపై ప్యాచ్‌వర్కుతోనే సరిపెడుతున్నారు. దీంతో భారీ వర్షం పడగానే రోడ్ల న్నీ గుంతలుగా మారుతున్నాయి. వాహనదారులు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయ సమీ పంలో రోడ్డు తెగిపోయింది. రోడ్డు రెండుగా చీలి పోవడంతో రాకపోకలు స్థంభించాయి. రోడ్డు తెగి పోయి రెండుగా చీలిపోయిన ప్రమాద సూచికలు కనిపించడంలేదు. ఇక్కడ రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం వుందని, ప్రాణనష్టం జరగకముందే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నా రు. ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్ప ల్-నారపల్లి, గోల్నాక- అంబర్‌పేట చేనెంబర్ మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక అంబర్‌పేట ఆలీకేఫ్-జలమం డలి క్రికెట్ గ్రౌండ్-ఉప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, కెసిఆర్ నగర్- నాగోల్ మెట్రో రోడ్డు మార్గంలో, అలాగే ఉప్పల్ ఆర్టీసి బస్సు స్టాండ్ అధ్వాన్నంగా తయారైంది. నాణ్యతారహిత పనుల వల్లే ఈ పరిస్థితి అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోడ్లు గుంతలు పడ్డ ఎవరూ పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా బాధ ఎవరికి చెప్పుకోలేక పోతున్నామని అన్నారు. లీడర్లు పాలకులు వాళ్ల తీరు మారదని మండిపడ్డారు. కేవలం ఓట్లు కావాలని వస్తారు.. సమస్యలు పరిష్కరించమంటే కనిపించరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అలాగే తయారయ్యారని వాపోయారు. వర్షం పడితే రోడ్లు మాకు నరకం చూపిస్తున్నాయని అన్నారు. రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యా యని తెలిపారు. దీనికి తోడు రోడ్లు తవ్వి ఎక్కడికక్కడ వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రోగాలు వస్తున్నాయని, వర్షం పడగానే చెరువుల్లా అయితాయి రోడ్లు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వాటర్ గుంతలు ఎక్కడ ఎప్పుడు రోడ్లపై ఏమవుతుందో అర్థం కాదన్నారు. గోతులమయంతో మేము ఇబ్బందులు పడుతున్నామంటూ వాపోయాడు. జీహెచ్ఎంసి రోడ్లపై కానీ ప్యాచ్‌వర్క్ కూడా వేయడం లేదని తెలిపారు.

ఐదు నెలల క్రితం నిర్మించిన రహదారులపై కూడా పలు ప్రాంతాల్లో గుంతలు పడి, కంకర తేలాయి. ఇక శివారు ప్రాంత ఫిర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లలో కంకరతేలి మోకాల్లోతున గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్ మండి, చిలకలగూడ, రాంనగర్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూర్చడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలత్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నగర శివారు ప్రాంతాలు నిజాంపేట, దుండిగల్, మణికొండ మున్సిపాలిటీల ప్రాంత రహదారుల్లో పరిస్థితి మరీ ఆధ్వాన్నంగా మారింది. తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పునరుద్ధరించలేదు. రాంనగర్-అచ్చయ్యనగర్-పద్మాకాలనీ నాలా పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కాగా, వర్షాలు వస్తున్నాయంటే నీరు నిలిచి రోడ్లు పొడవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఇందులో కొంత వాస్తవం ఉన్నా..శాస్త్రీయ విధానంలో రోడు నిర్మించకపోవడమే వరద నీరు నిలిచేందుకు ప్రధాన కారణమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రమాణాల ప్రకారం రోడ్డు మధ్యలో ఎత్తుగా ఉండి, పక్కలకు ఏటవాలుగా ఉండాలి. కానీ కార్పెటింగ్, రీ కార్పెటింగ్ ప్యాచ్ వర్క్‌ల పేరిట ఇష్టానికి బీటీ మిక్సింగ్ వేయడంతో చాలా ప్రాంతాల్లో ఎగుడు దిగుడుగా రమదారులు కనిపిస్తాయి. దీంతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు ఉన్న వాటిలోకి వర్షపు నీరు వెళ్లే పరిస్థితి చాలా ప్రాంతాల్లో లేదు. రోడ్ ప్రొఫైల్ సరిగా లేకపోవడమూ రోడ్డు పాడవడానికి కారణమన్నది నిపుణుల అభిప్రాయం.




# హైదరాబాద్ వార్త





## ఉప్పల్‌లో సన్‌రైజర్స్,పంజాబ్ క్రికెట్ మ్యాచ్ సందడి



**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన సన్‌రైజర్స్, పంజాబ్ జట్ల మధ్య జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌తో సందడి వాతావరణం నెలకొంది. క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలుగుతుందని ఆదివారం ఉదయం ప్రేక్షకులు ఆందోళన చెందారు. అయితే మధ్యాహ్నం వరకు ఉప్పల్‌లో వర్షం లేకపోవడంతో ప్రేక్షకులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం కాగా ఎటువంటి అంతరాయం లేకుండా మ్యాచ్ పూర్తి చేశారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లతో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హైదరాబాద్ జట్టు దాటిగా ప్రారంభించింది. మధ్యాహ్నం ఒంటి గంటల నుంచే స్టేడియం వద్ద సందడి వాతావరణం నెలకొంది. పాసులు ఉన్న పలువురు ప్రేక్షకులకు రెండు గంటల ముందే స్టేడియంలోకి అనుమతించారు. స్టేడియంకు వెళ్లే అన్ని రహదారుల వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఒక వైపు వర్షం, మరో వైపు రహదారులపై వాహనాల కారణంగా ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్ల వెంట కిలోమీటర్ల పరిధిలో వాహనాలు నిలిచిపోయాయి.







## 'మధు'రానగర్ మధుశాల ధ్వంసం

-భర్తను కొట్టినందుకు వైన్‌షాప్‌పై దాడి చేసిన మహిళ

**హైదరాబాద్, మే19, ప్రభాతవార్త:**

మద్యం కొనడానికొచ్చిన తన భర్తను కొట్టినందుకు ఒక మహిళ ఏకంగా వైన్‌షాపునే ధ్వంసం చేసిన ఘటన మధురానగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. మద్యం కొనేందుకు వచ్చిన తన భర్తపై వైన్ షాప్ సిబ్బంది దాడి చేయడంతో అతడి తల పగిలి తీవ్ర గాయాల పాలయ్యాడు. దాంతో రక్తంతో భర్తను చూసిన భార్య కోపోద్రిక్తురాలై సదరు వైన్ షాప్‌పై దాడి చేసింది. తన స్నేహితులను వెంట తీసుకెళ్ళిన ఆమె వైన్ షాపులోకి చొరబడి సిబ్బందిని చితకబాదింది. అనంతరం బాటిల్స్ పగలగొట్టి ర్యాక్‌లను విరిచేసింది. క్యాష్ కౌంటర్ పగలగొట్టింది. దాంతో స్థానికులు సమాచారమివ్వగా అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెను అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై కూడా విరుచుకు పడింది. తన భర్తను తల పగిలేటట్లు కొట్టిన వైన్ షాపు సిబ్బందిదే తప్పంటూ వాదనకు దిగిన ఆమె పోలీసులని కూడా చూడకుండా వారి జుట్లు పట్టుకుని కొట్టింది. దాంతో ఆమెనీ, ఆమె అనుచరులనూ, గొడవకి కారణమైన వైన్ షాప్ సిబ్బందినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వైన్ షాపు సిబ్బందిపై, దాడికి దిగిన మహిళపై వివిధ కేసులు నమోదు చేశారు.

## మరిన్ని మల్టీలెవల్ కార్ పార్కింగ్ బిల్డింగ్‌లను కట్టాలి : కెటిఆర్

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త**




పూర్తిస్థాయిలో ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌సీపీ) పనులు దాదాపు పూర్తి కావడం పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. పిపిపి విధానంలో నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో ఈ మల్టీటెవల్ కారు పార్కింగ్‌ను నిర్మించాలని 2016-17లో నిర్ణయిం చామని చెప్పారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆలస్యమైన ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు పూర్తికావచ్చిందని అన్నారు. ఇటువంటి మల్టీలెవల్ కార్ పార్కింగ్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని కెటిఆర్ అన్నారు. ముఖ్యమైన జంక్షన్లు, మెట్రో స్టేషన్లు, కమర్షియల్ సెంటర్లకు సమీపంలో ఇలాంటివి మరిన్ని కట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సైబర్ ఫ్రాడ్ చేయడానికి బ్యాంక్ అకౌంట్లు

-దేశ వ్యాప్తంగా 125 కేసుల్లో 82 బ్యాంకు ఖాతాల గుర్తింపు -ఐదుగురి అరెస్ట్

**హైదరాబాద్, మే19, ప్రభాతవార్త:**

సైబర్ నేరగాళ్ళకు బ్యాంక్ అకౌంట్లు తయారు చేసిన ముఠాని తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఈజీ మనీ కోసం అత్యాశకు లోనై పలువురు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు తెరిచి సైబర్ మోసగాళ్ళకు సరఫరా చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 125 కేసుల్లో 82 బ్యాంకు ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.5 కోట్లు జమైనట్లు తెలిసింది. ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్ళు విత్‌డ్రా చేసుకున్నారు. స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బృందం సాయంతో హైదరాబాద్ పోలీసులు నేర పరిశోధన మొదలుపెట్టగా, తగిన ఆధారాలు లభించడంతో మ్యూల్ ఖాతాలు అందిస్తున్న నిందితులను అరెస్ట్ చేశారు. వారు ఉత్తరాఖాండ్‌కు చెందిన ఆరిఫ్ షఫీ(40), పాతబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నవీద్(30), సోహైల్‌ఖాన్ (20), మహమ్మద్ దాదే ఖాన్(21), చాంద్రాయణ గుట్టకు చెందిన సోహైల్ ఖాన్ (25)లుగా గుర్తించారు. వారి వద్దనుంచి 65 బ్యాంక్ ఖాతాల కిట్లు, 14 డెబిట్ కార్డులు, 31 సిమ్‌కార్డులు, ఆరు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడైన ఆరిఫ్ షఫీ సౌదికి వెళ్ళిన అనంతరం క్రిప్టో కరెన్సీ వ్యాపారానికి సంబంధించిన మెళకువలు తెలుసుకున్నాడు. అందులో భాగంగా వివిధ ఆధారాలతో బ్యాంక్ అకౌంట్లతో పాటూ, సిమ్ కార్డులు తదితర సాంకేతిక ఆధారాలు సైబర్ నేరగాళ్ళకి అవసరమని గ్రహించాడు. ఈ చట్రంలోకి నగరానికి చెందిన తన స్నేహితులు మరికొందరిని లాగి సంపాదనా వివరాలు తెలియజేశాడు. బ్యాంకు ఖాతాలకు గానూ రూ.1500, సిమ్ కార్డులు ఇస్తే 10,000 ఇస్తున్నట్లు చెప్పాడు. దాంతో వీరంతా బేంక్ ఖాతాలు తెరిచి పాస్‌బుక్కు, డెబిట్ కార్డులతో పాటు సిమ్ కార్డులను విదేశాలకు పంపడం మొదలు పెట్టారు. దేశ వ్యాప్తంగా నమోదయిన కేసుల్లో గల బ్యాంకు ఖాతాల్లో సైబరాబాద్‌లో 3, హైదరాబాద్‌లో 3, రాచకొండలో ఒకటి, కరీమ్‌నగర్‌లో ఒకటి, జహీరాబాద్‌లో ఒకటి, ఇలా మొత్తం 9ఖాతాలను గుర్తించారు. ఈ మేరకు కేసు వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.








# నగరంలో మళ్లీ వర్షం

-మరో మూడు రోజుల పాటు వర్షాలు

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త**

నగరంలో పలు చోట్ల మళ్లీ వర్షం కురిసింది. ఇప్పటికే వచ్చే మూడు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి అధికారులు కూడా సూచనలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆదివారం నైరుతి రుతుపవనాలు అండమాన్ చేరుకున్న క్రమంలోనే నగరంలో వర్షం కురిసింది. సికింద్రాబాద్ పరిధిలోని బేగంపేట, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, జవహర్‌నగర్, సుచిత్ర, జీడీమెట్ల, కొంపల్లి, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, సనత్‌నగర్, పంజాగుట్ట, సోమాజిగూడ, ఎర్రగడ్డ, ఫతేనగర్, బాలానగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. కాగా, నగరంతో పాటు తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.


## సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శన





సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన అరుదైన చిత్రాలు

**చార్మినార్, మే 19 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియంలో ఇంటర్నేషనల్ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు చిత్రకారులు రూపొందించిన అరుదైన చిత్రాలు ఫోటో ప్రదర్శనలో ఉన్నాయి. అల్వీన్‌కాలనీకి చెందిన చిత్రకారులు కె.పురుషోత్తం చారి రూపొందించిన చార్మినార్ కట్టడం చిత్రం అద్భుతంగా ఉంది. అదే విధంగా ఎపిలోని అరకు ప్రాంతానికి చెందిన గిరిజనుల జీవన శైలికి సంబంధించిన చిత్రాలు, గ్రామీణ ప్రాంతం వాతావరణం ఫోటో, పాతకాలంలో పగిలి పోయిన కుండలను అతికిస్తున్న చిత్రం, లూనా మీద ఆరుగురు ప్రయాణం చేస్తున్న చిత్రంతో పాటు దాదాపు ఇరవై రెండు చిత్రాలు ఈ ప్రత్యేక ఫోటో ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. సాలార్‌జంగ్ మ్యూజియంను సందర్శించటానికి వచ్చిన పర్యాటకులు అరుదైన చిత్రాలను తిలకించి ఎంతో అనుభూతికి లోనయ్యారు.





## గచ్చిబౌలిలో ఉత్సాహంగా వైటథాన్ రన్...

-పిల్లల్లో ఏర్పడే కంటి క్యాన్సర్ల మీద అవగాహన కల్పిస్తూ సాగిన పరుగు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్

**గచ్చిబౌలి, మే 19 ప్రభాతవార్త**

చిన్నారుల్లో ఏర్పడే రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తింపుపై అవగాహన కల్పించడంతో పాటు చికిత్సకు నిధులు సేకరించేందుకు ఏర్పాటు చేసిన వైటథాన్ రన్ గచ్చిబౌలిలో ఉత్సాహంగా సాగింది. ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌ను ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాదాపూర్ డిసిపి డాక్టర్ వినీత్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మే నెల రెండవ ఆదివారం ప్రారంభించి, ఏడు రోజుల పాటు నిర్వహించే రెటినోబ్లాస్టోమా అవగాహనా వారాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైటథాన్ పరుగుతో సేకరించిన నిధులను రెటినోబ్లాస్టోమాతో బాధపడుతున్న పేద పిల్లల చికిత్స కోసం ఉపయోగించడంతో పాటు పరిశోధనకు ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వైటథాన్ రన్‌లో దాదాపు 2వేల మంది ఔత్సాహికులు పాల్గొన్నారని తెలిపారు. మూడేళ్ల లోపు వయసు ఉన్న పిల్లలకు ఏర్పడే రెటినోబ్లాస్టోమా అరుదైన కంటి క్యాన్సర్ అని, చికిత్సలో అనేక నెలల పర్యవేక్షణ, ఖరీదైన ప్రక్రియలు, శస్త్రచికిత్సలు ఉంటాయన్నారు. గత దశాబ్ద కాలంగా ఎల్వి ప్రసాద్ సంస్థ 2500కు పైగా చిన్నారులకు చికిత్స అందించిదని, అందులో 65శాతం ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం 150నుంచి 200 కొత్త రెటినోబ్లాస్టోమా చికిత్సలను ఎల్వి ప్రసాద్ సంస్థ చేపడుతుందని, అందులో 40శాతం తీవ్ర దశలో, 10 శాతం చివరి దశలో వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్వి ప్రసాద్ సంస్థ ఎక్జిక్యూటీవ్ చైర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, డాక్టర్ స్వాతి కల్కి, ఎన్ఎండిసి డైరెక్టర్ దిలిప్‌కుమార్ మహంతి, డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో నవ వధువు మృతి

**తార్నాక, మే 19 ప్రభాతవార్త :**
బోర్ మోటర్‌కు ఉన్న విద్యుత్ వైరు తాకడంతో ఓ నవ వధువు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన లాలాగూడ బూడిదిగడ్డ ప్రాంతంలో జరిగింది. లాలాగూడ ఎస్సై షాహిన్ కథనం ప్రకారం. స్థానికంగా ఉండే మౌనిక(26)కు గత నెల 24న రమేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. ఇదిలా ఉండగా మౌనిక శనివారం తన తల్లిని చూసేందుకు అమ్మగారి ఇంటికి వచ్చింది. ఆదివారం ఉదయం ఆమె బాత్‌రూంలో స్నానం చేస్తుండగా అందులో ఉన్న బోరు మోటార్‌కు విద్యుత్ వైరుకు షాక్ షర్ట్యూట్ ఏర్పడింది. దీంతో ఆమెకు షాక్ తగిలి కిందపడిపోయింది.అరుపులు కేకలు పెట్టడంతో కుటుంబ సభ్యులు ఆమె వద్దకు చేరుకున్నారు. వెంటనే 108కు ఫోన్ చేయడంతో ఆమె అప్పటికే మృతి చెందిందని 108 సిబ్బంది వెల్లడించారు. దీంతో మృత దేహాన్ని గాంధీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

...మరో ఘటనలో స్థానికంగా ఉండే ఆర్యనగర్( బూడిదిగడ్డ)కు చెందిన కృష్ణ, వై.సుభాషిని దంపతుల ఇంట్లో కూడా విద్యుత్ హెచ్చుతగ్గుల వల్ల విద్యుత్ షాక్ సంభవించింది. దీంతో కూతురి వివాహం కోసం దాచుకున్న రూ. లక్ష నగదు, ఇతర వస్తువులు, వంట సామాగ్రి, ఫర్నిచర్, టీవీ కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులు లబోదిబోమని మొత్తుకున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గూడ్స్ క్యారియర్ వాహనం ఢీ ద్విచక్రవాహనదారుడు మృతి

**ముషీరాబాద్, మే 19, ప్రభాతవార్త:**
గూడ్స్ క్యారియర్ వాహనం ఢీ కొనటంతో ద్విచక్రవాహన దారు దుమృతి చెందిన ఘటన దోమ లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథ నం ప్రకారం సిద్దిపేట జిల్లా బె జ్జంకి మండలం తోటపల్లె గ్రామానికి చెందిన కొన్నె అజయ్ (26) బోయినపల్లిలోని శ్రీకర హాస్పటల్‌లో అనస్థీషియా టెక్నీషి యన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అజయ్ తన ద్విచక్రవాహనంపై రాణిగంజ్ నుండి ట్యాంక్‌బండ్ మీదగా ప్రయాణి స్తూ ఉండగా ఎదురుగా అతివేగం గా వచ్చిన గూడ్స్ క్యారియర్ వాహనం అజయ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అజయ్ వాహనం మీద నుండి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స మాచారం అందుకున్న దోమల గూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని గాంధీ హాస్పటల్‌కు తరలించారు. మృతుని సోదరుడు రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గూడ్స్ కార్యరియర్ వాహనంను డ్రైవర్ పొన్న కుమార్ (27) నిర్లక్ష్యంగా నడపటం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తెలియటంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## యాలాల మండల వీరశైవ లింగాయత్ -లింగబలిజ సంఘం కార్యవర్గ సభ్యులు వీరే

**యాలాల ఏప్రిల్ 19,ప్రభాతవార్త :** యాలాల మండల వీర శైవ లింగాయత్-లింగబలిజ కార్యవర్గాన్ని శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పటేల్ ఉదయ్‌శంకర్,గౌరవ అధ్యక్షలు మోళిగి వీరేశం ప్రకటించారు. యాలాల మండల అధ్యక్షులుగా ఆకుల బస్వరాజ్, గౌరవ అధ్యక్షులుగా ఎ.శివకుమార్, ఉపాధ్యక్షులుగా అశోక్‌కుమార్, శివకుమార్, కిష్టాపూర్ రవి,పి. బసప్ప,ప్రధాన కార్యదర్శిగా బి.శరణు భూపాల్, కార్యనిర్వాహక కార్యదరిశగా బస్వరాజ్,సహకార్యదర్శిగా విజయ్,శశికుమార్,ఎ. శంకర్, కోశాధికారిగా వీరేశం, సలహాదారులుగా ప్రసాద్,కార్యవర్గ సభ్యులుగా సురేష్,బస్వరాజ్,రాజప్ప, బాల్‌రాజ్,సభాష్, రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు.యాలాల మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్,శరణుభూపాల్‌లు మాట్లాడుతూ తమను నమ్మి భాధ్యతలను అప్పజెప్పిన ప్రతి ఒక్కరికీ ధన్యవాధాలు తెలిపారు.సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## భక్తి శ్రద్ధలతో గ్రామం సుబిక్షం

**జిల్లెడు చౌదరిగూడ, మే 19,(ప్రభాతవార్త):** ప్రజల్లో భక్తి శ్రద్ధలు ఉంటే గ్రామం సుభిక్షంగ ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో నిర్వహించిన బీరప్ప జాతర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరప్ప దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్యేశ్యంతో నిర్వహించిన బీరప్ప జాతరను ప్రశాంతంగ జరుపుకోవాలని అన్నారు. బీరప్ప స్వామి ప్రజలందరి చల్లగ చూడాలని ఆయన వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు. ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు సత్తనారాయణరెడ్డి, అంజనేయులు, వెంకట నర్సింహారెడ్డి, భాస్కర్, రవి, రామకృష్ణ, చంద్రశేఖర్, ప్రసాద్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీపర్పగుడి నిర్మాణానికి భూమిపూజ

**బొంరాస్‌పేట్, మే 19,(ప్రభాతవార్త):** కొత్తూరు గ్రామంలో ఆదివారం బీరప్పగుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. కొత్తూరు గ్రామంలో ఆదివారం బీరప్పగుడి నిర్మాణానికి స్థలం తీసుకోవడం జరిగింది. గ్రామపెద్దలు నిర్ణయించి భూమిని ఇవ్వడం జరిగింది. గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ మహేందర్, గుణశేఖర్, బింరావ్ బల్లప్ప ఉపసర్పంచ్ శామప్ప వాడి మమర్స్‌శ్రీనివాస్ చందు చిన్నయ్య లక్ష్మప్ప కిషన్‌నాయక్ కురువ సంఘం అధ్యక్షుడు బల్లప్ప ఉపాధ్యక్షుడు పెద్దకుర్వమహేందర్ చిట్లపల్లి మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామిగుడి నిర్మాణానికి విరాళం అందజేత

**తలకొండపల్లి, మే 19, ప్రభాతవార్త:** ఆర్లకుంటతండాగ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి తన వంతు సాయంగా బానవత్ తిరుపతి కుటుంబ సభ్యులు 50,116 యాభైవేల ఒక వంద పదహార్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దశరథ్ నాయక్, ఈశ్వర్‌నాయక్ బాణవాత్ దాస్యనాయక్ బీమ్లాల్ జగ్రూసూర్య చందర్ జాంప్లు తిరుపతి భిక్యం భాస్కర్ హెమ్లాల్ శ్రీరాం వినోద్ రమేష్ శ్రీను గణేష్ తండా యువకులు పెద్దలు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేం

**తలకొండపల్లి, మే 19, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఏరియా సిపిఎం పార్టీ కన్వీనర్ కానుగుల వెంకటయ్య సిపిఎం నాయకులు జే పెంటయ్య పోశయ్య పర్వతాలు జంగయ్య అమాలి సంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ నాటక ప్రదర్శనకు ఆర్థిక సాయం

**తలకొండపల్లి, మే 19, ప్రభాతవార్త:** పడకల్ గ్రామం తలకొండపల్లి మండలం రంగారెడ్డి జిల్లా శ్రీరేణుక ఎల్లమ్మ జీవిత చరిత్ర బైలు నాటక ప్రదర్శనకు శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాసు శ్రీనివాస్‌రెడ్డి 10000వేల రూపాయలు సాయంగా అందజేశారు. ఈకార్య క్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కేశవరెడ్డి రామ్ చందర్ బూర్గిల నరసింహ రమేష్ చవితి పోషయ్య జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కడ్తాల్,మే 19 ప్రభాతవార్త :** కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోర్వకొండ తండాకు చెందిన సభావత్ సోమ్లు శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు కడ్తాల్, జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ వెంటనే కోర్వకుండ తండాకు చేరుకుని సోమ్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సోమ్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనం తరం సోమ్లునాయక్ కుటుంబ సభ్యులకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మా జీ మండల రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, యాదయ్య,సభ్యులు సౌజన్య, రాజునాయక్, శ్రీను, కృష్ణ, సోమల పాండు, వెంకటయ్య, దేవు వీరబిక్కు పాల్గొన్నారు.

## మహిళా విధుషీమూర్తులకు మణిహారం అమృతలత-అపురూప పురస్కారాలు

**-దూరదర్శన్ పూర్వసంచాలకుడు ప్రఖ్యాత సాహిత్యవేత్త డా. ఓలేటి పార్వతీశం**



అభినందన పుస్తకావిష్కరణ కావించిన పార్వతీశం, అలేఖ్యపుంజాల, తులసి, అమృతలత, రమాదేవి తదితర అతిథులు

**నాంపల్లి, మే 19 ప్రభాతవార్త :**
సాహిత్యానికి, లలితకళలకు దూరమౌతున్న యువతకు ఆసక్తి, అనురక్తి కలిగించేందుకు వివిధరంగాల్లో విశేషకృషిచేసిన నిష్ణాతులైన మహిళా విధుషీ మూర్తులకు ప్రదానం చేస్తున్న అమృతలత-అపురూప పురస్కారాలు మణిహారం వంటివని ప్రఖ్యాత సాహిత్యవేత్త, ప్రసార కళాప్రవీణ డా. ఓలేటి పార్వతీశం అన్నారు.తనతోపాటు పదిమంది ఎదగాలన్న అమృతత్వగుణం ప్రోదుకున్న ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త అమృతలత 14సంవత్సరాలు ఈ మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించడం శ్లాఘనీయమని, సాహిత్య సంగీత నృత్య వివిధ కళా రంగాల్లో ప్రతిభావంతులైన మహిళామణులను అపురూప పురస్కారంతో సన్మానించడం హర్షదాయకమని కొనియాడారు. అనంతరం అలేఖ్యపుంజాల, సినీనటి తులసి తదితరులు ప్రసంగించారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆదివారం రాత్రి వైభవోపేతంగా అమృతలత-అపురూప అవార్డ్స్ 2024 ప్రదానోత్సవానికి అవార్డుల వ్యవస్థాపకురాలు, ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త డా. అమృలత నేతృత్వంలో ఆదివారం ముఖ్యఅతిథిగా డా. ఓలేటి పార్వతీశం విచ్చేసి విశిష్ట అతిథులు ప్రముఖ సినీనటి తులసి, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారగ్రహీత ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, నెల్లుట్ల రమాదేవి తదితరులతో కలిసి ముందుగా అతిథులు, అవార్డు గ్రహీతల పరిచయాలతో కూడిన అభినందన పుస్తకాన్ని ఆవిష్కరించి డా. కె.వి.కృష్ణకుమారి, డా. ఆలూరి విజయలక్ష్మిలను ఘనంగా సన్మానించి అమృతలత జీవనసాఫల్య పురస్కారాలను; వివిధరంగాల్లో నిష్ణాతులైన ప్రతిభామూర్తులు జి.ఎస్.లక్ష్మి, సుశీలమ్మ, శివలక్ష్మి, సావేరి దుర్గాభవాని, సమతారోష్ని, నందూరి సుందరీనాగమణి, డా. కొండపల్లి నీహారిక, జ్యోతిర్మయి, అంజనీ, గీతహజారే, ప్రేమమాలిని, వీణావాణిలను ఘనంగా సత్కరించి అపురూప అవార్డ్స్ 2024 ప్రదానం చేశారు.

## అజరామరం శ్రీ తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలు : కోలేటి దామోదర్‌గుప్తా



నరేష్‌ను సన్మానిస్తున్న దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ, లలితారావు తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 19 ప్రభాతవార్త :**
శ్రీశ్రీశ్రీ తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలు అజరామరమని, 32వేలకుపైగా కీర్తనలతో శ్రీవేంకటేశ్వరస్వామిని స్తుతించి దరిచేరిన భాగ్యవంతుడని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. భారత్ ఆర్ట్స్, ఏబిసి ఫౌండేషన్ల ఛైర్మన్లు లయన్ కె.వి.రమణారావు, లలితారావులు అన్నమాచార్య 616వ జయంతోత్సవాలను భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడుతూ దేశసంపద, ప్రాచీన నాగరికతలకు నిలయమైన కళారూపాలను, కళాకారులను ప్రోత్సహిస్తూ శ్రీశ్రీశ్రీ అన్నమయ్య నృత్యహేళ కన్నులపండువగా జరుపడం అద్వితీయమని, సహకరిస్తున్న కళాకారుల తల్లిదండ్రులు, గురువులను ప్రశంసించారు. శ్రీ అన్నమాచార్య 616వ జయంత్యోత్సవాలను పురస్కరించుకొని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆదివారం ఉదయం 9నుండి రాత్రి 9వరకు జరిగిన శ్రీ అన్నమయ్య నృత్యహేళకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోలేటి దామోదర్‌గుప్తా విశిష్ట అతిథులు ప్రముఖ టీవి నటుడు నరేష్, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, లయన్ లలితారావు తదితరులతో కలిసి శ్రీఅన్నమయ్య నృత్యహేళ శాస్త్రీయ నృత్య కళా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారుల నాట్యగురువులు 33మందిని, వందలాదిమంది వారి శిష్యులను ఘనంగా సత్కరించి అభినవ నర్తకి; గానశిఖరం; నాట్యకౌస్తుభ; గానకిరణం అవార్డులతో సత్కరించి ఎంతగానో అభినందించారు. ఆదివారం రోజంతా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శ్రీ అన్నమాచార్య కీర్తనలు, శాస్త్రీయ నృత్యాలతో ఆధ్యాత్మికశోభను సంతరించుకొని అశేషప్రేక్షకులను తన్మయుల్నిచేసి భక్తిమార్గంలో పయనింపజేసింది.

## జూపార్కును సందర్శించిన 25,600 సందర్శకులు

**చార్మినార్,మే 19 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కును ఆదివారం వేలాది మంది సందర్శకులు తిలకించారు.దాదాపు 25, 600 మంది పర్యాటకులు జూ పార్కును చూడటానికి రావటంతో కిక్కిరిసి పోయింది.కాగా శనివారం 15 వేల మంది సందర్శకులు జూపార్కును తిలకించారని అధికారులు తెలిపారు.ప్రతీ శని,ఆదివారంతో పాటు సెలవు దినాలలో జూపార్కు ప్రవేశ టిక్కెట్ రుసుం పెద్దలకు 80 రూపాయలు,చిన్న పిల్లలకు 45 రూపాయలు,మిగతా రోజులలో పెద్దలకు 70 రూపాయలు,చిన్న పిల్లలకు 45 రూపాయలు,అదే విధంగా రైలు పెద్దలకు 45 రూపాయలు,చిన్న పిల్లలకు 25 రూపాయలు,సఫారీ ఏసి పెద్దలకు 120 రూపాయలు,నాన్ ఏసి పెద్దలకు 80 రూపాయలు,చిన్న పిల్లలకు 40 రూపాయలు టిక్కెట్ల రూపంలో వసూళ్లు చేస్తున్నారు.



సందర్శకులతో కిక్కిరిసి పోయిన జూ పార్కు

## తెలంగాణ ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలి

**-తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి**

**గోషామహల్,మే19ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యోగుల సమస్యల పరిష్కారించాలని కోరుతూ తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం కేంద్ర,రాష్ట్ర సంఘాల ప్రతినిధులు మారం జగదీశ్వర్,ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ, కస్తూరివెంకట్, లక్ష్మన్, మహేష్ కుమార్ గౌడ్,శంకర్‌లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసివినతిపత్రం అందచేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు రావాల్సిన నాలుగుడిఏ బకాయిలు,ఒక డిఏను విడుదల చేయాలన్నారు.పిఆర్‌సి,హెల్త్‌కార్డు అమలు చేయాలని,సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు.అందుకు ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందచేసిన టిఎన్‌జిఓ కేంద్ర,జిల్లాప్రతినిధులు

# సేంద్రియ మామిడి

**- కుంచావరం నుండి అమెరికా, ఆస్ట్రేలియాకు ఎగుమతులు**
**-అంతరాష్ట్ర ప్రమాణాలతో కాయల పక్వం కర్ణాటకలో తెలుగు రైతు కృషి**

**బంట్వారం, మే19, (ప్రభాతవార్త):** భారత దేశంలోని ఆహార పంటలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంటుందనేది అందరికి తెలిసిన విషయమే. విదేశాలకు ఎగుమతులు అవుతున్నాయంటే వాటి నాణ్యత ప్రమాణాలు ఎలా ఉంటాయనేది అడగాల్సిన అవసరం లేదు. భారత మార్కెట్‌లో నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చిన ఆహార పంటలు, పండ్లు, ఇతర ఏలాంటివైన వ్యాపారులు మార్కెట్ చేస్తుంటారు. దీంతో ఇక్కడి ప్రజలకు మార్కెట్ చౌకకు దొరికిన అంత నిణ్యతంగా ఉండవనేది అందరికి తెలిసిందే. అయితే విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారంటే అలాంటి ఆహార పంటలు పండ్లు, కూరగాయలు అన్ని అంతరాష్ట్రాల ప్రమాణాల మేరకు పండించాల్సి ఉంటుంది. అంతరాష్ట్రాల ప్రమాణాలకు అనుగుణంగా ఓ తెలుగు రైతు మన పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో సేంద్రీయ పద్ధతిలో మామిడి పండ్లను పండిస్తున్నారు. ఈ మామిడిని బెంగళూరు, హైదరాబాద్ నగరాలతో పాటు, విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. వీరు పండించిన పండ్లకు కర్ణాటకలో మంచి పేరు ఉండటంతో అక్కడి అధికారులు సైతం మామిడి తోటకు వచ్చి పండ్లను కొంటున్నారు. ఇలాంటి రైతు మన తెలంగాణకు, సరిహద్దులోనే ఉండడం ఎంతో గొప్ప విషయంగా చర్చించుకుంటున్నారు.

### చెట్లకు సేంద్రీయ ఎరువులు.. కాయలను రైపనింగ్ పద్ధతిలో పక్వ

పొలంలో ఉన్న చెట్లన్నింటిని ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండ, సేంద్రీయా పద్ధతిలో పెంచుతున్నారు. పంటన ు తమ వద్ద ఉన్న షెడ్లోనే రైపనింగ్ పద్ధతిలో పండ్లుగా పక్వానికి పెడతారు. అందుకు అవసరమైన ఊష్ణోగ్రత నియంత్ర పద్ధతిలో ఇవ్వడం జరుగుతుంది. పండ్లను పక్వానికి వచ్చేందుకు అవసరమైన ఇతరైన్ వాయువు ను అవసరమైన నిర్ణిత మోతాదులో ఇస్తుంటారు. ఒక రోజుకు సుమారు ఐదు వందల బాక్సులను ప్రత్యేక చాంబర్లో ఉంచడం వల్ల పండ్లుగా మారుతున్నాయి. పండిన పండ్లను నాణ్యత ప్రమాణాల మేరకు వివిధ రకాలకు అ నుకూలంగా వాటిని పరిశీలించి విభజిస్తారు. విభజించిన వాటిని వాహనాల్లో వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు.

అట్లూరి సత్యనారాయణ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ హైదరాబాద్ కంపనిలో, భార్య ధనకోటేశ్వరమ్మ ఈసీఐఎల్ కంపనిలో రిటైర్డ్ ఉద్యోగులు. సత్యనారాయణ 2013లో రిటైర్ అయినాక పూర్తీ స్థాయిలో వ్యవసాయంపై దృష్టి పెట్టారు. ఇందుకు గాను కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా (కలబురగి) జిల్లా, చించోళి తాలుకాలోని కుంచావరం సమీపంలోని షాదిపూర్ రెవె న్యు పరిధిలో సుమారు 120 ఎకరాల బంజరు భూములను కొన్నారు. మొదటగావారు భూమిని చదు ను చేసి, వ్యవసాయానికి అ నుకూలంగా చేసి, అల్లం, కూరగాయలు, పొప్పాయ, చెరుకు లాంటి. పంటలను పండించారు. దాంతో పాటు వివిద రకాల మామిడి చెట్ల ు పెంచు తున్నారు. అయితే గత ఐదారేళ్ళుగా పూర్తీగా కూర గాయల పంటల ు వేసిన, అంతగా లాభాలు రాకపో వడంతో వదిలేశారు. అనంతరం ఐదారేళ్లుగా మొత్తం మామిడి పంటపై దృష్టి పెట్టారు. మామిడి పంటకు ఎక్కువ ప్రాదాన్యతనిస్తు సేంద్రీయ పద్ధతిలో పండ్లు పండిస్తున్నారు. ప్రతి యేడాది 350 టన్నుల నుండి, 400 టన్నుల వరకు పంట పండుతుందంటున్నారు. హిమాయత్ ఒక్కోకాయ కిలో వరకు ఉండగా, బెనిషాన్, మల్లికా లాంటి కాయలు 800 గ్రాముల నుండి, కిలో వస్తున్నా యి. పంట చేతికొచ్చిందంటే సుమారు రెండు కోట్ల వరకు ఆదాయం వస్తుందని రైతు చెపుతున్నారు. ఈ యేడాది ఇప్పటికే 120 టన ్నుల మామిడి పండ్లు ఎగుమతి చేసినట్లు రైతు పేర్కొంటున్నారు. ప్రధానంగా తాము బెంగళూరుకు పంపిస్తాము. అక్కడ ఇన్నోవా ఆగ్రో కంపనికి పంపి వారు అమే రికా, ఆస్ట్రేలియా, సింగపూర్ లాంటి దేశాలకు పంపుతారని రైతు తెలియజేస్తున్నారు. ఇదే కాక మన హైదారాబాద్‌లోని విజయా, ఉషోదయ స్టోర్ మార్కెట్లకు సైతం డిమాండ్ మేరకు తరలి స్తున్నమని పేర్కొంటున్నారు.

### మామిడిలో ప్రధానంగా ఆరు రకాలు

సుమారు 120 ఎకరాల పొలంలో హిమాయిత్ 500 చెట్లు, బేషాన్ 7000 చెట్లు, దసారి 1500 చెట్లు, మల్లికా 500 చెట్లు, రసాలు 300 చెట్లు, అమ్రాపాలి 150 చెట్లు, ఇతర చెట్లు న్నాయి. మొత్తం ఫామ్లో సీజన్లో ప్రతి రోజు పర్మ నెంట్ కూలీలు 10 మంది ఉండగా, 15 మంది వరకు దినసరి కూలీలు పని చేస్తుంటారు. ఇతర సీజన్లో ప్రతి రోజు 60 మంది వరకు కూలీలు పని చేస్తుంటారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

### ప్రభుత్వ పరంగా సహాయం అవసరం అట్లూరి సత్యనారాయణ, రైతు

సేంద్రియా పద్దతి అంటే నాకు ఇష్టం. సేంద్రీయ పద్దతిలో ఇంత పెద్ద మొత్తంలో వ్యవసాయం చేస్తున్నా. ఇందుకు సేంద్రీయ పంటలు మరింత అభివృద్ధి పరిచి దేశానికి మంచి పండ్ల ను అందించాలన్న స్థానిక ప్రభుత్వాల సహాయ, సహాకారాలు అవసరం ఉంది. ఇప్పటికైన ప్రభుత్వం తమ ు గుర్తించి తగిన సహాయం చేయాలి.

## ఆదర్శవంత పాత్రికేయులు మాదాల వీరభద్రరావు



రమణకు మాదల వీరభద్రరరావు పురస్కారాన్నిఅందించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:**
నమ్మిన సిద్ధాంతాలను ఎట్టి రాజీలేకుండా తన వ్యాసాలతో ప్రజలను జాగృతం చేసిన మాదాల వీరభద్రరావు ఆదర్శవంతమైన పాత్రికేయులు అని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అన్నారు. ఆదివారం రాత్రి శ్రీ త్యాగరాయ గానసభ, సాధన సాహితీ స్రవంతి, స్వర్గీయ మాదల వీరభద్రరావు స్మారకసమితి, శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్యసమరయోధులు, సీనియర్ పాత్రికేయులు స్వర్గీయ మాదల వీరభద్రరావు 105వ జయంతి సందర్భంగా ప్రముఖ పాత్రికేయులు రాయప్రోలు రమణకు 'మాదల స్మారక పురస్కారం' ప్రదానోత్సవ సభ త్యాగరాయగానసభలో మానస ఆర్ట్స్ అధ్యక్షుడు బండారుపల్లి రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. సభలో మానస ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి, కవి రఘుశ్రీ ముందుగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళావిఎస్. జనార్దనమూర్తి మాట్లాడుతూ మాదల వీరభద్రరావు స్వాతంత్ర పోరాటంలోనూ, ఆంధ్ర, రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గాపాల్గొన్నారని,ఆంధ్రప్రభ, ఆంప్రధ జనత వంటి నాటి ప్రముఖ పత్రికల్లో కాలమిస్ట్‌గా, వ్యాఖ్యాతగా పనిచేసి నిజాయితీ జర్నలిస్ట్‌గా గుర్తింపు పొందారన్నారు. తండ్రి మరణించిన తర్వాత కూడా ఆయన పేరిట పురస్కారాలను ప్రతి సంవత్సరం క్రమం తప్పక ఇస్తున్న రాజేంద్రప్రసాద్ అభినందనీయులు అని అన్నారు. తల్లిదండ్రులను విస్మరించిన వారు క్షమఅర్హులుకారన్నారు. పురస్కారం అందుకున్న రాయప్రోలు రమణ తమ తండ్రి కళాసుబ్బారావు నుంచి గానసభతో అనుబంధం ఉందని, ఆయన స్థానిక ఇంగ్లీష్ పత్రిక సిటిజన్స్ ఈవినింగ్‌లో పనిచేస్తూ తెలుగు పత్రికలు ప్రజాశక్తి, తదుపరి నవతెలంగాణలో 40ఏళ్ళుగా పత్రికారంగంలో ఉన్నారన్నారు. వార్తలు రాయడంలో శ్రద్ధ, నిజాయితీ, అంకితభావం ఉన్న వారన్నారు. పురస్కారప్రదాత మాదల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి వీరభద్రరావు పేరిట పురస్కారాలు పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎబికె.ప్రసాద్, వరదాచారి వంటి వారు అందుకున్నారన్నారు. ఈ ఏడు నిబద్ధత ుల రమణకు అందించడం సంతోషంగా ఉందన్నారు. రమణ మాట్లాడుతఊూ ఎందరో పెద్దలు అందుకున్న వీరభద్రరావు పురస్కారం తనను ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పరీక్షల మెడికల్ క్యాంపు ప్రారంభం



ఉచిత మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల, మే 19, ప్రభాతవార్త**
సూరారం కాలనీ మైత్రినగర్ కమిటీ హాల్ నందు ఆదివారం ఆశ్రయ్ ఆకృతి ఆసుపత్రి వారి సౌజన్యంతో వినికిడి లోపం ఉన్న వారికి ఉచితంగా చెవుల పరీక్షలు చేయుటకు ఉచిత మెడికల్ క్యాంప్‌ను మాజీ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ సూరారం కాలనీ, రాజీవ్ గృహకల్ప, మైత్రినగర్ ప్రాంతంలో వినికిడి లోపంగల వారికి ఉచితంగా పరీక్షలు చేసి ఉచిత వినికిడి మిషన్‌లను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ్ ఆకృతి ప్రాజెక్టు కో ఆర్డినేటర్, మైత్రి నగర్ అధ్యక్షులు అశోక్, రాజీవ్ గృహకల్ప అధ్యక్షులు శివగౌడ్, కృష్ణ, వెంకట్‌రెడ్డి, డాక్టర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన పద్మారావుగౌడ్



సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌ను సన్మానించిన బిఆర్ఎస్‌నాంపల్లి ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్


**అఫ్జల్‌గంజ్,మే19ప్రభాతవార్త:**
ఎంపి ఎన్నికల తరువాత నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ సందర్శించారు.ఈమేరకు టి.పద్మారావుగౌడ్‌కుఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా టి.పద్మారావుగౌడ్‌ను నాంపల్లి నియోజకవర్గంబిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ శాలువ కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ రెడ్‌హిల్స్ డివిజన్ ఇన్‌చార్జ్ ప్రియాగౌడ్, బిఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్‌అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న భారత అభ్యదయ ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సి పూర్వ విద్యార్థులు

**చార్మినార్,మే 19 ప్రభాతవార్త :** జియాగూడలోని భారత అభ్యుదయ హైస్కూల్ 1995-96 బ్యాచ్‌కు చెందిన ఎస్ఎస్‌సి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.అప్పటి జ్ఞాపకాలను నెమరి వేసుకుంటూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు.పాఠశాల లోగోతో ప్రత్యేక మెమోంటోను అందించుకుంటూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో మనోజ్,రామస్వామి,ప్రభాకర్,గజానంద్,ఆనంద్,సునీతతో పాటు దాదాపు డబ్బై మంది పాల్గొన్నారు.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లోని చారిత్రాత్మకమైన ఆలయంలో జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బబుల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 19, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ 6వ ఫేస్‌లోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కోఆర్డినేటర్ సతీష్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ బాల మురగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన




ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

**పేట్ బషీరాబాద్, మే 19, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్‌లోని సుభాష్ నగర్‌లో తమిళయన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్టాయి స్వామి అధ్యక్షతన, తమిళయన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా శ్రీశ్రీశ్రీ బాల మురగన్ కుమారస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తమిళయన్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులు మాట్లాడుతూ మొదటిరోజు స్వామి వారి ఊరేగింపు, రెండవ రోజు ప్రత్యేక హోమాలు చేసి మూడవ రోజు స్వామివారి విగ్రహం ప్రతిష్ఠ చేయడం జరిగిందని తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక పార్టీల రాజకీయ నాయకులు, ప్రముఖులతో పాటు తమిళయన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కొట్టాయి స్వామి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గణేశన్, జనరల్ సెక్రటరీ కె.చిన్న స్వామి, ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్.ఆనంద్, తమిళయన్స్ అసోసియేషన్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై లక్ష మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ స్వేచ్ఛ వ్యవస్థాపకుడు కిరణ్ చంద్ర




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న స్వేచ్ఛ వ్యవస్థాపకుడు కిరణ్ చంద్ర తదితరులు

**గచ్చిబౌలి, మే 19 ప్రభాతవార్త**

ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా లక్షమంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) మీద ఇంటర్న్‌షిప్ కల్పించనున్నట్లు స్వేచ్ఛ వ్యవస్థాపకుడు వై.కిరణ్‌చంద్ర తెలిపారు. గచ్చిబౌలిలోని స్వేచ్ఛ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కిరణ్ చంద్ర మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటి హైదరాబాద్, ఓజోన్టెల్ కమ్యూనికేషన్స్, మెటా సహకారంతో విద్యార్థులకు ఏఐ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఉచిత సాఫ్ట్‌వేర్, ఉచిత నాలెడ్జ్‌ను అందించే లాభాపేక్ష లేని సంస్థ స్వేచ్ఛ అని అన్నారు. ఏఐ అంటే ప్రతి ఒక్కరికి చాట్ జిపిటి గుర్తుకు వస్తుందని, తెలుగులో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయా అనే సందేహం కలుగుతుందన్నారు. భారతీయ భాషలలో ఏఐ సొల్యూషన్లు అందుబాటులోకి తీసుకురావాలని ముందుకు వచ్చిన స్వేచ్ఛ చందమామ కథలు, స్వేచ్ఛ గొంతుకలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మరో అడుగు ముందుకు వేసి లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌లో చాట్ జిపిటిని తయారు చేసే ప్రక్రియను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా లక్షమంది విద్యార్థులకు ఏఐ శిక్షణను అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. నెలరోజుల ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓజోన్టెల్ కమ్యూనికేషన్స్ సిటీవో చైతన్య చోక్కారెడ్డి, స్వేచ్ఛ కార్యదర్శి ప్రవీన్ చంద్ర పాల్గొన్నారు.

## గొప్ప వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యులు



సంకీర్తలను గానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:**

32వేల సంకీర్తనలను రచించిన మానవాళికి అందించిన గొప్ప వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యులు అని ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారులు లక్షణమూర్తి, సాయిశృతి సంగీత అకాడమి డైరెక్టర్ వసుధామూర్తి అన్నారు. 616వ అన్నమాచార్యుల వారి జయంతి సందర్భంగా ఆదివారం మహిళలకు అన్నమయ్య సంకీర్తనలపై శిక్షణ శ్రీ సాయిశృతి సంగీత అకాడమి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సనాతన ధర్మానికి ప్రతీకలుగా సంకీర్తనలు నిలుస్తాయన్నారు. ప్రాచీన కాలం నుంచి ఇటువంటి గొప్ప గొప్ప వాగ్గేయకారులకు మనకు అందించిన గొప్ప సంపద అని అన్నారు. కాగా 25న నగరంలోని శిల్పారంలో జరిగే కార్యక్రమానికి అతిథులుగా మోటివేషనల్ స్పీకర్ కె.వి.ప్రదీప్, యాంకర్ సరస్వతీ ప్రదీప్, నర్తకీ ఆశ్రిత వేముగంటి నండూరి, సంగీత దర్శకులు డాక్టర్ జోశ్యభట్ల తదితరులు పాల్గొంటారన్నారు.

## సివిల్స్ ఫౌండేషన్ కోర్సులో అడ్మిషన్‌లు

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:** అమిగోస్ ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో 'సాకార్' పేరుతో అండర్ గ్రాడ్యుయేట్‌లకు సివిల్స్ ఫౌండేషన్ కోర్సులో అడ్మిషన్‌లను ప్రారంభిస్తున్నట్లు అకాడమి ఒకప్రకటనలో తెలిపింది.ఇతర వివరాలకు 9000230735 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చన్నారు. కళాశాలకు వెళ్ళేవారు, ప్రతి రోజు, వారంలో, నెల వారీగా పరీక్షలు, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సౌకర్యం, ఉదయం, సాయంత్రం వేళల్లో బ్యాచ్‌లుంటాయని వెల్లడించింది, సివిల్ సరీసెస్ పరీక్షలకు సంబంధించిన తమ అభిరుచిని ముందుకు సాగించడానికి ఇదో మంచి అవకాశం అని పేర్కొంది. అశోక్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో ఉన్న తమ అకాడమిని సంప్రదించవచ్చని వివరించారు.

# భారతీయ సనాతన ధర్మ సారథి ఆది శంకరాచార్య

**-విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు**



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, కళావిఎస్.జనార్ధనమూర్తి తదితరులు

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:**

భారతీయ సనాతన ధర్మ సారధి ఆది శంకరాచార్య అని, ఆయన వేద భాష్యాలు పరమ ప్రామాణికమని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా తత్వవేత్త జగద్గురు ఆది శంకరాచార్య సంస్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కాలినడక పర్యటించి శంకరాస్తకం, కనకధారస్తోత్రం వంటి పలు దేవతల ప్రార్ధనా శ్లోకాలను తన 12ఏళ్ళ వయస్సులోనే అందించిన ఆది గురువు అని ఆమె వివరించారు. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన గొప్పవ్యక్తి ఆది శంకరాచార్యులవారు అని, సర్వజీవులలోనూ ఆత్మ ఒక్కటే అని బేధాలు లేవన్న ఆది శంకరుని మార్గం అనుసరణీయమని అన్నారు. హిందూమతాన్ని ఉద్దరించిన త్రిమతాచార్యులలో ప్రథములు ఆది శంకరాచార్యులు అని, సమకాలీన హిందూమతం ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త అని అన్నారు. కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ ఆది శంకరాచార్య దేశంలో నాలుగు ప్రాంతాలలో నాలుగు పీఠాలు సనాతన ధర్మ పరిరక్షణకు స్థాపించారని, ఆ పిఠంలో ఒక్కటైన శృంగేరి పీఠాధిపతి నియంత్రణలో ఉన్న జ్ఞాన సరస్వతి దేవాలయానికి తాను ధర్మాధికారిగా కావడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలు డాక్టర్ ఎస్‌పి.భారతి, సంగీత గురువు మల్లాది ఉష, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు



జ్యోతిని వెలిగించి అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలను ప్రారంభించిన దృశ్యం

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా ఆదివారం డెక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్, సాలార్జంగ్ మ్యూజియం సహకారంతో జెబిఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి) హైదరాబాద్ డిజైన్ విభాగం, తెలంగాణ స్కాలర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ టూరిజం, సౌత్‌జోన్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఇండియా సహకారంతో 'మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్' అనే అంశంపై అంతర్జాతీయ మ్యూజియం డే కార్యక్రమం జరిగింది. సౌత్‌జోన్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఇండియా కార్యదర్శి నితిన్ సిన్హా స్వాగతోపన్యాసం చేయగా, సాలార్ జంగ్ మ్యూజియం పూర్వ డిప్యూటీ క్యూరేటర్ మల్లం రవీందర్ మ్యూజియం, మ్యూజియం నిర్వహణ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమి చైర్మన్ ఎం.వేదకుమార్, ప్రొఫెసర్ దీపక్ జాన్ మాథ్యూస్, సిహెచ్.బాబ్జీరావు, ఆర్కియాలాజికల్ సర్వేఆఫ్ ఇండియా నుంచి డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్(రిటైర్డ్), ఇంటర్‌కామ్ కార్యదర్శి నితిన్ సిన్హా, టిఎస్ఎఎ ఉపాధ్యక్షుడు గణేష్‌కుమార్(గన్ను) పాల్గొని ప్రసంగించారు. ఎం.వేదకుమార్ 'సాంప్రదాయం, భవిష్యత్తు దృష్టి కోసం సహకారాలు' అంశంపై ప్రసంగించగా కీలక సహకారిగా నిర్వాహకుడిగా తన పాత్రను వివరించారు. కార్యక్రమంలో భాగంగా 'వాయిస్ ఆఫ్ హెరిటేజ్' విజేతలు, తెలంగాణ శిల్పులు, కళాశాల సంఘం, ఐఐటి హైదరాబాద్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్స్ ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం పాల్గొన్న వారికి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. డాక్టర్ మహ్మద్ షాహీద్ కళలు, చేతిపనులు, మ్యూజియం విద్యపై ప్రసంగించగా, డాక్టర్ శివాజీ సాంకేతిక పురోగతిని ప్రస్తావిస్తూ 'సాంస్కృతిక వారసత్వం, మ్యూజియం విద్య గురించి చర్చించారు. డాక్టర్ ప్రసాద్ డిజిటల్ ఇంటరాక్టివ్‌అండ్ మ్యూజియం ఎడ్యుకేషన్ గురించి ప్రస్తావిస్తూ డిజైన్ ఆర్కిటెక్చర్ భవిష్యత్తు అవకాశాలను వివరించారు.

## తెలుగుభాష సాహిత్య విమర్శలో నిష్పాక్షిక విశ్లేషణ పెరగాలి : ఆచార్య ఎల్లూరి శివారెడ్డి



ఎస్వీ రామారావు, మసనచెన్నప్పలను సత్కరిస్తున్న శివారెడ్డి, చెన్నయ్యలు

**నాంపల్లి, మే 19 ప్రభాతవార్త :**

ప్రాచీనకాలం నుండి తెలుగు సాహిత్య పరిణామ వికాసాలలో సాహిత్య విమర్శ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొందని, తెలుగుభాష సాహిత్య విమర్శలో నిష్పాక్షిక విశ్లేషణ పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహించిన సాహిత్య విమర్శ-అధ్యయన శిబిరంలో వక్తలతోపాటు అధ్యక్షోపన్యాసంలో సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు బొగ్గులకుంట పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఆయన అధ్యక్షతన జరిగిన శిబిర ప్రారంభోత్సవ సభలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామారావు ప్రధాన ప్రసంగంలో 1875లో కందుకూరి వీరేశలింగం రచించిన విగ్రహతంత్ర విమర్శనము అనేది మొట్టమొదటి విమర్శాగ్రంథమని, అప్పటి నుండి నేటివరకు వెలువడిన విమర్శా గ్రంథాలు, విమర్శకుల గురించి సవివరపరిచారు. ప్రాచీన సాహిత్యంలో విమర్శ పలురూపాల్లో ఉందని ఆచార్య మసన చెన్నప్ప వివరించగా విమర్శ, వ్యాఖ్యానం, సమీక్ష, సాహిత్య చరిత్ర పరిశోధనల మధ్య బేదసాదృశ్యాలను డా. లక్ష్మణ చక్రవర్తి విశదీకరించారు. ముందుగా సభకు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య స్వాగతం పలుకగా డా. డి.చంద్రశేఖరరెడ్డి, డా. వి.త్రివేణి, డా. సి.మృణాళిని తదితరులు ఆయా అంశాలపై ప్రసంగించారు.

## లక్ష్మణ్ పై దాడి చేయటం అమానుషం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ముషీరాబాద్, మే 19, ప్రభాతవార్త:**

బీజేపీ కార్యకర్త అయిన లక్ష్మణ్‌పై దాడి చేయటం అమానుషమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మా నగర్‌బస్తీలో ఇటీవల దాడికి గురైన గోకారం లక్ష్మణ్ మాదిగ కుటుంబాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఎన్నికల రోజు ఓటింగ్ ముగిసే సమయానికి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సతీష్ అనే వ్యక్తి లక్ష్మణ్ మాదిగపై దాడి చేయటంతో, గాయపడిన లక్ష్మణ్‌ను గాంధీ హాస్పటల్‌కు తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన లక్ష్మణ్‌ను కిషన్‌రెడ్డి కలిసి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పూసరాజు, గడ్డం నవీన్, ఎంఆర్‌పీఎస్ నాయకులు గజ్జెల రాజశేఖర్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# వివాహిత అదృశ్యం..

**జీడిమెట్ల, మే 17, ప్రభాతవార్త**

గాజులరామారం కైసర్‌నగర్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైసర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఉత్తమ్ ఠాకూర్‌కు 8 నెలల క్రితం కల్పనాదేవి (19)తో వివాహం జరిగింది. ఉత్తమ్ ఠాకూర్ లేబర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అతని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో, అతను భార్య కోసం బంధువులను, స్నేహితులను విచారించగా ఆచూకి తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కల్పనాదేవి ఎత్తు 5.3 అడుగులు, రంగు ఫెయిర్, హిందీ మాట్లాడుతుంది. గ్రీన్ కలర్ డ్రస్సు వేసుకుందని తెలిపారు. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత చికిత్స అందించాలి

**-ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజనరసింహకు విజ్ఞప్తి చేసిన పెన్షనర్స్ జేఏసీ**



ఆరోగ్యశాఖామంత్రిని సత్కరిస్తున్న పెన్షనర్స్ జేఏసీ నాయకులు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:**

పెన్షనర్లకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత చికిత్స అన్ని ఆసుపత్రులలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ జేఏసీ ఛైర్మన్ కే.లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన చేస్తూ ఇటీవల ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజనరసింహను పెన్షనర్స్ జేఏసీ బృందం కలిసి, ఉద్యోగస్తుల, పెన్షనర్ల హెల్త్‌కేర్ ట్రస్ట్ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరామని, అదేవిధంగా దానికి సంబంధించిన ప్రభుత్వ ఆర్డర్లు, ఇతర రాష్ట్రాలలో ఏ విధంగా అమలు జరుగుతున్నదీ కూడా మంత్రికి వివరించామని తెలిపారు. దీనపై మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పెన్షనర్ల ఆరోగ్య భద్రతకై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో సెక్రటరీ జెనరల్ సుభాకర్‌రావు, కోఛైర్మన్‌లు సూర్యనారాయణ, ఏ.రాజేంద్రబాబు, అడిషనల్ సెక్రటరీ జనరల్ ఎం.వి. నరసింగరావు ఉన్నారు.

### సాలార్‌జంగ్ మ్యూజియంలో ఘనంగా ఇంటర్నేషనల్ మ్యూజియం డే



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

**చార్మినార్,మే 19 ప్రభాతవార్త :**

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ఆదివారం దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్,సాలార్‌జంగ్ మ్యూజియం,టిఎస్ఎస్ఎ,తెలంగాణ టూరిజం,ఐకోమ్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అన్న అంశంపై అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని సాలార్‌జంగ్ మ్యూజియంలో నిర్వహించారు. వాయిస్ ఆఫ్ హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్న పలువురికి సాలార్‌జంగ్ మ్యూజి యం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.ఈ సమావేశంలో దెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ, ఐకోమోస్ ఇండియా కార్యదర్శి నితిన్ సిన్హా , ఐకోమోస్ ఇండియా సౌత్‌జోన్ ప్రతినిధి ప్రొఫెసర్ సూర్యనారాయణ,సాలార్‌జంగ్ మ్యూజియం ఏఓ నాగేశ్వర రావు,ప్రొఫెసర్‌దీపక్ జాన్ మాద్యూస్,రిటైర్డ్ ఎఎస్ఐ సిహెచ్ బాబ్జీరావు, ఐకామ్ ఇంటర్‌కమ్ కార్యదర్శి ఆర్.నిన్హా, టిఎస్ఎస్ఎ ఉపాధ్యక్షులు గణేష్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం..



సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి

**జీడిమెట్ల, మే 19, ప్రభాతవార్త**

సుభాష్ నగర్ లాస్ట్ బస్ స్టాప్ పాక్ సాగర్ ఏరియాలో ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ నాయకులు భరత్ సింహారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్, శ్రీనివాస్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి నివాళులు అర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:**

నిజామ్ రాచరిక పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ పరిపాలనకు వ్యతిరేకంగా భూస్వాముల దాష్టీకాలకు వ్యతిరేకంగా జరిగిన వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్.వివేక్, బి.వెంకటస్వామిగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. పేదలనే తన పిల్లలుగా భావించి కించిత్తు స్వార్ధం లేకుండా నిస్వార్ధంగా నిరాడంబరంగా తుదిశ్వాసవరకు ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన యోధుడన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు వి.నాగభూషణం, పార్కు సభ్యులు రమేశ్‌రెడ్డి, కిషన్ రావు, సాగర్‌రెడ్డి, రవికుమార్, రాఘవరెడ్డి, కందుకూరి నర్సింహా, మనోహర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, నారాయణ, అంజయ్య, నారాయణగౌడ్, తీగల సాగర్, టి.స్కైలాబ్ బాబు, కోటరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని దర్శించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:**

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం నగరంలోని ప్రతిష్టాత్మకమైన బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అధికారులు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు అమ్మవారి శేషవస్త్రాలు తీర్థప్రసాదాలను అందించారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ నియోజకవర్గం మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, నేతలు శంకర్ మూదిరాజ్, సాయి మాధవ్, సాయిచాణక్యరెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి

**-జాతీయ ఎంబిసి కన్వీనర్ కొండూరు సత్యనారాయణ**

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని జాతీయ ఎంబిసి కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీనినిలబెట్టుకోవాలన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన చేపడ్తామని చెప్పి అసెంబ్లీలో తీర్మాణం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయకపోనూ వచ్చే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలుంటాయని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం తెలంగాణలోని బీసీ, ఎంబీసీలను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లు తేల్చేందుకు అవసరమైన చర్యలను కాంగ్రెస్‌ప్రభుత్వం చేపట్టాలని, రాష్ట్రంలోని ఎంబీసీ, బీసీల జనాభా ఎంత వారి వెనుకబాటు తనానికి కారణాలేంటి అనే విషయాలను పరిశీలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాతనే బీసీల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రాజకీయ రిజర్వేషన్‌లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## దివ్యాంగులను ఆదుకోవడం సమాజ బాధ్యత



నిరుపేద దివ్యాంగులకు ఉచితంగా వీల్ ఛైర్స్ పంపిణీ చేస్తున్న శ్రీకర్‌శర్మ

**సైఫాబాద్, మే 19 ప్రభాతవార్త:**

మానవతా దృక్పథంతో దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంపైన ఉందని శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ గుర్తు చేశారు. సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ ఆచార్య కొండూరి హరిగోపాల్ సౌజన్యంతో జగ్గంగూడ గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధ దివ్యాంగులు బొమ్మరిపల్లి బాలమ్మ, మాన్య శంకర్‌రావుకు ఉచితంగా వీల్ ఛైర్స్ పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు, నిరుపేద వృద్ధులకు ఎదోక విధంగా సేవలు అందించడంలో ఎంతో తృప్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగియుండాలని, వృద్ధులను, దివ్యాంగులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధిగా ప్రముఖ సామాజిక వేత్త మనిగండ్ల కిష్టయ్యగుప్తా మాట్లాడుతూ సమాఖ్య ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జగ్గంగూడ గ్రామంలో 15 మంది దివ్యాంగులకు ఉచితంగా వీల్ ఛైర్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యుడు ఎం.శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE Ist JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT: AT : MALKAJGIRI OS NO 410 2024**

**Between**
Smt Y.Jayasree & Another ....Plaintiffs
**And**
Smt S.Maduri
Sri S.Krishna Kishore
MRO,Keesara, RR District and
All Concerned, ... Defendents

The Plaintiffs have filled the above suit for declaration to declare them as legal heirs of Late Y. Srinivas Rao S/o Late Y.Rama Rao, who died on 28-04-2020 further to declare the plaintiffs are the successors of Schedule property mentioned here under:

**SCHEDULE PROPERTY**
All that open Plot no 205, total to an extent of land of 523 Sq Yds, situated in sy no 588,589,597 and 606, located at Nagaram Village, Medchal Taluq, R.R District, Bounded by: North: 30" Ft Wide Road; South: Plot no 206; East : Plot No 208 And West : 25" Ft Wide Road in case if any person(s)/Claimants have any claim or interest in respect of Scheduled Property referred above, may appear before the Hon'ble I Junior Civil Judge, Ranga Reddy District at Malkajgiri on 19-06-2024 at 10.30, either in person or through counsel, otherwise the matter will be decided accordingly by passing suitable orders.

**//BY THE ORDER OF HON'BLE COURT//**
**Y.MURALIDHAR RAO**
**Y.PRASANNA KUMAR**
**Advocates**
Off : # H.No :2-3-298/1, GFloor, Road No 4, Sri Sai Nagar, G.S.I(P.O)., HYDERABAD – 500 068
**Ph -9177230044& 9885346450**

**IN THE COURT OF THE HONOURABLE XIV ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT: AT HYDERABAD O.S. No. 41 OF 2024**

**Between:**
Smt. Venkatalaxmi Potula & 3 others ... Plaintiff
**And**
The Commissioner GHMC &
All concerned ...Defendants
**To:**
All Concerned ...Defendant no. 2

Kindly take notice that the above named Plaintiffs filed OS No. 41 of 2024 on the file of the Honourable XIV Additional Chief Judge, City Civil Court, At Hyderabad, to declare the Plaintiff no. 1 to 4 as the legal heirs of the deceased Late Vellamchety Sesha Talpa Sai in respect of suit schedule properties mentioned hereinunder. The same is posted on 14 th June 2024 for appearance. Anyone having objection to the same may appear and state such objections on 14 th June 2024 at 10:30 am, at the above mentioned court, failing which the matter shall be decided in your absence in accordance with law.

**ITEM 1 -** Flat bearing No. 209, consisting of 2 BHK of having super built up area of 995 sft, bearing door No. 2-2-1073/A to K, Sai Mithra Estates, situated at Amberpet, Hyderabad –500013.
**ITEM 2 -** Flat bearing No. 210, consisting of 2 BHK of having super built up area of 957 sft, bearing door No. 2-2-1073/A to K, Sai Mithra Estates, situated at Amberpet, Hyderabad – 500013.

**By order of Court**
**K.SRIDEVI**
**Advocate**
#11 AND 12, SHOBHA PAVANI APTS, 1-9-1114 TO 1117, VIDYANAGAR HYDERABAD – 500 044.
**Ph: +91 9949185000.**

**IN THE COURT OF HON'BLE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: SECUNDERABAD O.S.NO. 331 OF 2024**

Between:
**Sri. Pulla Gowri Shanker** and others ...**Plaintiffs**
And
**The Mandal Revenue Officer**
Marredpally Mandal, & others ....**Defendants**
To
**All concerned,**

Please take notice that in the above suit filed by the Plaintiffs against the Defendants seeking a relief to declare that the Plaintiff No.1 Sri. Pulla Gowri Shanker, Plaintiff No.2 Sri. Vijaya Bhaskar Pulla, and Plaintiff No.3 Smt. Ivaturi Saroja are the sons and only daughter of Late Smt. Pulla Kanakavalli and Late Sri. Pulla Rama Subba Rao who died on 25/10/2009 and 25/02/2023 respectively for legal status only and the same stands posted to **18/06/2024 at 10:30 AM** for appearance. If any person/s have any kind of objection whatsoever may appear on the said date. In default of your appearance either in person or through your counsel the matter will be heard and decided exparte.

(By order of the court)
**Sd/- R.K. SUDHIR KUMAR**
**Advocate**
42, West Marredpally, Secunderabad-500 026
**Ph: 040-27800671**

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో అంజలి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తాండవ నృత్యకారి, మూషికవాహన, రుక్మిణి ప్రవేశం, బ్రహ్మాంజలి, పలుకే బంగారమాయేనా, పుష్పాంజలి, అలివేలు మంగ, కులుకగ నడవరో, నమశ్శివాయతే, గోవర్ధన గిరిధర, జతిస్వరం, చక్కని తల్లికి చాంగ్‌భళా, కృష్ణ శబ్దం, గోవిందా గోవిందా తదితర అంశాలను కళాకారులు నిధి, సుదేష్ణ, వంశిక, సిరి, తనూజ, అనన్య, స్నకిత, కీర్తి తదితరులు ప్రదర్శించి మెప్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : చింతల

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త:** భారీగా కురిసిన వర్షాలకు నాగోల్‌లోని పలుకాలనీలో వర్షపు నీరు నిలిచి ఇబ్బందికరంగా మారిందని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వరదనీరు కాలనీలలోకి చేరి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు సమాచారం ఇవ్వడంతో కార్పొరేటర్ ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపునీరు నిలిచిన కాలనీలో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరద నీరు బయటకు పోయే విధంగా జిహెచ్‌ఎంసి సిబ్బందితో జేసీబి సహాయంతో వెంటనే సమాచారం పరిష్కరించడం జరిగింది అన్నారు. వర్షాకాలంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు.

## ఘనంగా సుందరయ్య వర్ధంతి వేడుకలు



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

**తుర్కయంజాల్, మే 19 ప్రభాతవార్త :** పేదల పెన్నిధి, ప్రజల మనిషి, స్వాతంత్ర సమరయోధులు, కమ్యునిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, వీర తెలంగాణ సాయుద రైతంగా పోరాట రథసారది కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు సిపిఎం నాయకులు మండల సత్యనారాయణ అధ్యక్షతన తుర్కయంజాల్ రాగన్నగూడ పార్టీ కార్యాలయం, సుందరయ్యనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ మాట్లాడుతూ సుందరయ్య చిన్నతనంలోనే అసమానతలకు, అంటరానితనానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడి వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి తన ఇంటినుండే పోరాటం మొదలు పెట్టారనీ అన్నారు. సుందరయ్య అత్యంత నిరాడంబరంగా జీవించిన గొప్ప ఆదర్శ నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే.అరుణ కుమార్, కే వెంకటకృష్ణ, కొండిగారి శంకర్, ఐ.కృష్ణ, కందుకూరి శారద, బి.శంకరయ్య, జే.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : పవన్



పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ శ్రీసాయిబాబాకాలనీ కాలనీలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు స్థానిక సమస్యలపై కాలనీవాసులు వినతి పత్రాన్ని అందజేశారు. సాయిబాబాకాలనీలో సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆదివారం ఆయన కాలనీ వాసులతో కలిసి పర్యటించి కాలనీలో మంచినీటి, డ్రైనేజ్‌లైన్ సమస్యలను పరిశీలించారు. కాలనీలో త్రాగునీరు సరిగ్గా రావడం లేదని, లోప్రెషర్ సమస్య ఉందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. వెంటనే జలమండలి లైన్ ఇన్స్పెక్టర్‌ని పిలిపించి నీటి సమస్యను పరిశీలించారు. నీరు ప్రెషర్ ఎక్కువగా వచ్చేలా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీరు సరిపోయేలా చూడాలని సూచించారు. డ్రైనేజ్‌నీళ్లు నిండి బయటకు వస్తున్నాయని వాటిని మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాలని జల మండలి అధికారులకు సూచించారు. కాలనీ వాళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలియజేశారు. కాలనీలో ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో అధ్యక్షుడు రామారావు, జనరల్ సెక్రటరీ సురేష్ యాదవ్, రాజశేఖర్, వెంకటయ్యగౌడ్, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రావు, అమర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : మారం భరత్‌రెడ్డి



పెన్షనర్స్‌కు కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

**మలక్‌పేట, మే 19 ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేట సలీంనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మాక్సి విజన్ ఐ ఆసుపత్రి సహకారంతో పెన్షనర్స్‌కోసం ఉచితంగా కంటి పరీక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణకోసం వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. తమ అసోసియేషన్ ఆద్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కంటి వైద్య శిబిరంలో పలువురు పెన్షనర్స్ అధిక సంఖ్యలో పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ జనరల్ చోల ఓం ప్రకాష్‌యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రావు, కోశాధికారి జి.ప్రసాదరావు, ఆఫీస్ బేరర్స్ మాక్సివిజన్ ఆసుపత్రి మేనేజర్ మహేందర్, అసిస్టెంట్ మేనేజర్ మహేష్, అప్తమాలజిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత కాలనీల్లో సబితా ఇంద్రారెడ్డి పర్యటన.. సమస్యల పరిశీలన



కాలనీవాసుల నుండి సమస్యలు తెలుసుకుంటున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** వరా ్షలు కురుసు ్తన్న నేపథ్యంలో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, జై భవానీనగర్ కాలనీల్లో పర్యటించారు. కార్పొరేషన్ మేయర్, స్థానిక కార్పొరేటర్ అయిన మూఢావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్‌తో కలిసి ఆమె కాలనీల్లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆమెకు సమస్యలను వివరించారు. అనంతరం ఆమె స్పందిస్తూ తగిన చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరింపజేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, మాదరి సురేఖ రమేష్, ఎనుగుల అనిల్ యాదవ్, కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఫణిరాజ్, విజయసింహారెడ్డి, పూర్యానాయక్, పలువురు మహిళలు పాల్గొనా ్నరు.

## చంపాపేటలో ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**సైదాబాద్, మే 19 ప్రభాతవార్త:** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతిని పురస్కరించుకుని చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించనట్లు ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ తెలిపారు. చంపాపేటలోని ఆర్య వైశ్య సంఘం కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం చౌరస్తా వరకు అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఊరేగింపు అనంతరం దాతలు వీర బొమ్మ కిరణ్, లక్ష్మిపతి, బాలరాజులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె రవీందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, అదనపు కార్యదర్శి ఊరె మధుసూధన్‌గుప్తా, అమావాస్య అన్నదాన కమిటీ అధ్యక్షుడు ఇడుకుల విజయనాథ్ గుప్తా, కోశాధికారి రమణయ్య, ఎలకుర్తి జగన్, చికటిమళ్ల లోకేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


## కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న కాలనీ సంఘం సభ్యులు

**వనస్థలిపురం, మే 19 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ ఫేస్ 1 కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం గురించి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, కార్యవర్గ సభ్యులు ధనరాజ్, నవీన్‌కుమార్, రాములు, ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ చొరవతో అన్నపూర్ణ కాలనీలో ఎట్టకేలకు రోడ్డు పనులకు మోక్షం



అన్నపూర్ణ కాలనీలో రోడ్డు వేస్తున్న దృశ్యం

**నాచారం, మే 19 ప్రభాతవార్త :** నాచారండివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ చొరవతో ఎట్టకేలకు రోడ్డు పనులకు మోక్షం లభించింది. రూ. 47 లక్షల వ్యయంతో డివిజన్ లోని అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్ నుంచి లక్ష్మి స్టార్స్ ట్రంక్ లైన్ వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సదరు మంజూరైన పనులను బీజేపీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నెలల తరబడి పనులను ప్రారంభించలేదని స్థానికులు ఆరోపించారు. దీంతో కార్పోరేటర్ స్పందించి కమీషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమీషనర్ పంకజ, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులకు పలు మార్లు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి.

## ఘనంగా వాసవి మాత శోభాయాత్ర

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త:** గడ్డిన్నారం ఆర్యవైశ్య సంఘము ఆధ్వర్యంలో కొత్తపేటలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం వాసవిమాత శోభయాత్ర కొత్తపేట కన్యకాపరమేశ్వరి దేవాలయం నుండి విద్యుత్ దీపాల అలంకరణతో డబ్బు వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బోగ్గారం దయానంద్‌గుప్త, డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేంద్రగుప్తా, అధ్యక్షులు ఎం.ఎల్.ఆర్.గుప్తా, చకిలం రమణయ్య, ఎన్టీఆర్ కృష్ణ, చిదరా నాగేందర్, చింతల బాలరాజ్, కాచం శ్రీనివాస్, వాసు, రామిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి మాత అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటి నేతలు బిక్కుమళ్ల సుధాకర్‌గుప్త, రమేష్‌గుప్త, సంతోష్‌గుప్త, పాలడుగు సంతోష్‌గుప్త, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆర్య వైశ్య సంఘం నేత ఉప్పల శ్రీనివాసగుప్త తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అభిషేకం, సాముహిక కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఉప్పల్ రామాలయం నుంచి మేళ తాళాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని కోలాటం ఆడారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణ చేశారు. రంగురంగు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు, మహిళలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బలాల



అక్బర్‌బాగ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, మే 19 ప్రభాతవార్త :** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జలమండలి అధికారులకు సూచించారు. వర్షాలు అధికంగా కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం షీలారాణి, మేనేజర్ అల్తాఫ్, కార్పొరేటర్ మినాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీరును తొలగించే విధంగా చర్యలు చేపట్టాలి : కార్పొరేటర్ రాగుల

**వనస్థలిపురం, మే 19 ప్రభాతవార్త :** అకాల వర్షం కారణంగా వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో వర్షపు నీరు నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డికి సమాచారం అందజేసారు. వెంటనే స్పందించిన రాగుల సంబంధిత జిహెచ్‌ఎంసి ఎఇ ప్రజ్ఞకు ఫోన్ చేసి పద్మావతినగర్‌కాలనీలో నిలిచిన వర్షపు నీరు పోయే విధంగా సంబంధిత సిబ్బందితో చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఈఎపిసెట్ ఫలితాల్లో సత్తా చాటిన వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ బీరప్ప, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** తెలంగాణ ఈఎపిసెట్-2024 ఫలితాల్లో బాలాపూర్ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఈ కాలేజీకి చెందిన విద్యార్థి ఎస్.రాకేష్ ఈఎపిసెట్ ఎంపిసి విభాగంలో రాష్ట్ర స్థాయిలో 975వ ర్యాంకును, ఎస్.లోకేష్ 1054 ర్యాంకును సాధించారు. మరో 9 మంది విద్యార్థులకు పది వేల లోపు ర్యాంకులు వచ్చాయి. అదే విధంగా ఇటీవల ఏప్రిల్ 25న విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో వి.రాకేష్ 721వ ర్యాంకు సాధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మన్ సిద్దాల లార్డ్ ్స బీరప్ప, వైస్ ఛెర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పోలోజు రవికుమార్, తిప్పర్తి నర్సింహారెడ్డిలు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలనిచ్చి అభినందించారు.

## ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు



వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న వెంకన్న, ఎం.వినోద, భీష్మాచారి తదితరులు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఉప్పల్‌లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎం.వినోద, ఉప్పల్ సిపిఎం నాయకులు జె.వెంకన్న, భీష్మాచారి, ఊర్మిళ, ఉపేందర్, వెంకటేష్, పద్మ, అంజనేయులు తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో కృషిచేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నేతలు పాల్గొన్నారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ది : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బాధితుడు రమేష్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, మే 19 ప్రభాతవార్త :** హస్తినాపురం డివిజన్ నందనవనంకు చెందిన రమేష్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అతని ఆర్థిక స్థితులు బాగలేక వారి కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుధీర్‌రెడ్డి ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడంతో వారికి లక్ష యాభై వేల రూపాయలు ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు అయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుందన్నారు. ఈ పథకం పేదలకు వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, మున్నాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : మహ్మద్ కలీం



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన ఎంఎస్‌కె క్రికెట్ అకాడమి విద్యార్థులు

**మలక్‌పేట, మే 19 ప్రభాతవార్త :** విద్యార్థులు క్రీడలలో రాణించాలని మాస్టర్ స్ట్రోక్ క్రికెట్ అకాడమి ఛైర్మన్, హెడ్ కోచ్ మహ్మద్ కలీం పేర్కొన్నారు. అండర్-12 టి 30 జివైఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో అత్తాపూర్‌కు చెందిన మాస్టర్ స్ట్రోక్ క్రికెట్ అకాడమి విద్యార్థులు విజయం సాధించి ట్రోఫిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన ఎంఎస్‌కె అకాడమి కెప్టెన్ ఖలీల్‌ఉల్లా, జట్టు సభ్యులకు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడం తోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు.

## పేన్ మహోత్సవ అవగాహన సదస్సు



పెన్ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త:** పెన్ మహోత్సవ ఉత్సవ ఆహ్వానాన్ని అందుకున్న దిల్‌షుక్‌నగర్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం, దిల్‌షుక్‌నగర్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం కమిటీ సభ్యులకు పెన్ కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమిటీ సభ్యులు పెన్ యొక్క కనెక్టివిటీ తామందరూ ప్రత్యక్షంగా వీక్షిస్తున్నామని, పెన్ ఇతర వినూత్న కార్యక్రమాలు చేయాలని సంగం ప్రతినిధులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అనంతుల నవీన్, కోసిగ అనికేత్, అక్కెనపల్లి వేణు, మామిడ్ల అశోక్, శ్యామ్‌సుందర్, సలహాదారుడు డాక్టర్ విజయరంగా, తోటరాజు, మాలి కరుణాకర్, భూషణ్ చంద్రమోహన్, ఆరే క్రాంతి, ఎక్క రమేష్, లవంగాల అనిల్‌కుమార్, బిళ్ళకంటి శ్రీనివాస్‌పటేల్, చెలిమెల్ల ప్రదీప్, బాకారం సత్యనారాయణ, కటార్ల ధనరాజ్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ, వర్షపు నీటి ఔట్‌లెట్ సమస్యల పరిష్కారానికి కాలనీవాసుల వినతి

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 16వ డివిజన్‌కు సంబంధించిన సాయిస్మార్ట్ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని కోరారు. ఆదివారం వారు స్థానిక కార్పొరేటర్ ఎనుగుల అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు కాలనీలో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య గురించి వివరించారు. వర్షపు నీటి ఔట్‌లెట్ లేకపోవడంతో కూడా ఇబ్బందులు పడుతున్నామని వారు దృష్టికి తెచ్చారు. ఈ మేరకు స్పందించిన సబితారెడ్డి అప్పటికప్పుడు సాయి స్మార్ట్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ, ఔట్‌లెట్ సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. దీంతో కాలనీవాసులు ఆమె స్పందనకు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారం : ఎంపిఆర్

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్‌లో ప్రజాదర్బార్‌లో భాగంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు సమస్యలను విన్నవించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జిలు



జడ్జీలు చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించిన దృశ్యం.

**కుషాయిగూడ, మే 19, ప్రభాతవార్త :** జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, ఛైర్మన్, జిల్లా జడ్జి వి.బాలభాస్కర్, సెక్రటరీ కం సీనియర్ సివిల్‌జడ్జి డి.కిరణ్ కుమార్‌లు చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. అక్కడ ఖైదీల భోజనం, ఆరోగ్య వసతులు, వారి కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, న్యాయ సహాయం గురించి ఖైదీలకు వివరించారు. జిల్లా జడ్జి, జైలు అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.